

అన్నప్రసాద భవనానికి రూ.లక్ష విరాళం

కొత్తపేట: వాడపల్లి వెంకన్న ఆలయ అన్న దాన భవన నిర్మాణానికి హనుమంతువర్జుల నరసింహకుమార్ – లక్ష్మిఫణికుమారి దంపతులు (లొల్ల) రూ.1,00,005 అందజేశారు.




కట్టె కాలే వరకూ వైఎస్సార్ సీపీతోనే..

జక్కంపూడి కుటుంబం కట్టె కాలే వరకూ వైఎస్సార్ సీపీతోనే ఉంటుందని ఆ పార్టీ యువజన విభాగం గోదావరి జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త జక్కంపూడి గణేష్ స్పష్టం చేశారు.

8లో

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం 2,65,105 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి గోదావరి డెల్టా కాలువలకు 13,750 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద 10.30 అడుగుల వద్ద నీటి మట్టం నెలకొంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీలో సామాజిక సమతూకం

పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల **జగ్గిరెడ్డి**



వల్లీబాబాను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి

కొత్తపేట: వైఎస్సార్ సీపీలో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ అన్ని కమిటీల్లో సామాజిక సమతూకం పాటిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఇటీవల ప్రకటించిన జిల్లా కమిటీలో కొత్తపేట మండలం పలివెలకు చెందిన షేక్ వల్లీబాబా సెక్రటరీ యాక్టివిటీగా నియమితులైన విషయం తెలిసిందే. ఆయన నియోజకవర్గ ముస్లిం నాయకులతో కలసి గురువారం రావులపాలెం మండలం గోపాలపురంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు జగ్గిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనకు ముస్లిం సంప్రదాయ టోపీ అందించి సత్కరించారు. ప్రతిగా జగ్గిరెడ్డి వల్లీబాబాను అభినందిస్తూ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ కమిటీల్లో ముస్లింలకు ప్రాధాన్యం కల్పించడంలో భాగంగా వల్లీబాబాకు సెక్రటరీ యాక్టివిటీగా పదవి ఇచ్చామన్నారు. ముస్లింలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రావులపాలెం పెద్ద, చిన్న మసీదుల అధ్యక్షులు బాషా, మీరా, ఉపాధ్యక్షుడు జహంగీర్, కోశాధికారి జహంగీర్, సభ్యులు సందాని, అమీర్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి చేయూత



చిన్నారికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: ఆరేళ్ల చిన్నారి వైద్యానికి రావులపాలెం కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.1.25 లక్షల సాయం అందించారు. పెరవలి గ్రామానికి చెందిన కళ్యాణి మౌనిక (6) నాలుగు నెలల కిందట కాగితాలు వెలిగించి ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తూ శరీరమంతా కాలిపోయింది. ఇప్పటి వరకూ రెండు సర్జరీలు చేశారు. ఇంకా వైద్యం అందించాల్సి ఉంది. ఈ ప్రమాదం జరిగాక చిన్నారి పరిస్థితి చూసి బెంగతో ఆమె తండ్రి గుండెపోటుతో మృతి చెందాడు. పేద కుటుంబం కావడంతో సాయం కోసం కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను ఆశ్రయించింది. దీంతో సంస్థ సభ్యులు పెరవలి వెళ్లి దాతల ద్వారా సేకరించిన మొత్తం రూ. 1.25 లక్షలను మౌనికకు అందజేశారు.

పంచాయతీకి 'పచ్చ'పాతం



గున్నేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కూటమి నేతల ఫ్లెక్సీ

అమలాపురం రూరల్: గున్నేపల్లి అగ్రహారం పంచాయతీ కార్యాలయం పచ్చరంగును పులుముకుంది. ఇది టీడీపీ కార్యాలయాన్ని తలపించింది. పంచాయతీ కార్యాలయం ఆనుకుని ఎంపీపీ పాఠశాలలో మెగా పీటీఎం కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయాన్ని మూసివేసేలా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, సర్పంచ్ పెద్దిరెడ్డి రాముతో ముద్రించిన ఫ్లెక్సీని ఏర్పాటు చేయడంపై తల్లిదండ్రులు ఆసహనం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యాలయం పేరు కూడా కనిపించకుండా ఫ్లెక్సీని పెట్టడంపై విస్మయం చెందారు. పంచాయతీ కార్యాలయాలకు పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, స్టిక్కర్లు, ప్రజాప్రతినిధుల ఫొటోలు అతికించరాదని నిబంధన ఉంది. అయినా ఇలా ఏర్పాటు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పంచాయతీ కార్యాలయమా.. లేక టీడీపీ కార్యాలయమా అని మండిపడ్డారు.

రబీ ధాన్యం సొమ్ము విడుదల

సాక్షి, అమలాపురం: జిల్లాలో రబీ ధాన్యం సొమ్ములు ఎట్టకేలకు విడుదలయ్యాయి. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో సొమ్ములు చెల్లిస్తామన్న కూటమి ప్రభుత్వం రెండు నెలల తరువాత ఈ సొమ్ములు విడుదల చేయడం గమనార్హం. జిల్లాలో 379 రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేసి వాటి ద్వారా 32,996 రైతుల వద్ద నుంచి రూ.620.98 కోట్ల విలువైన 2,69,986 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. దీనిలో 23,491 రైతుల ఖాతాల్లో రూ.432.11 కోట్లు చెల్లించారు. మిగిలిన 9,505 రైతులకు రూ.188.87 కోట్లను పెండింగ్‌లో ఉంచారు. వీటిని గురువారం చెల్లించినట్టు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి పి.శ్రీనివాస్ తెలిపారు.

డొక్క లెండుతున్నాయ్!



- కొండెక్కిన కొబ్బరి కాయలు
- తిరోగమనంలో డొక్క ధర
- రైతుల వద్ద టన్నుల కొద్దీ నిల్వలు
- రెండు నెలల కిందట ట్రాక్టర్ సరకు రూ.1,500
- ఇప్పుడు రూ.500 ఎదురు ఇచ్చి, ఎగుమతులు

సాక్షి, అమలాపురం: కొబ్బరి ధర కొండెక్కింది.. రికార్డు స్థాయిలో పెరిగింది.. దానికి తగ్గట్టు పెరగాల్సిన పీచు ఉత్పత్తుల ధర తిరోగమనంలో కొట్టుమిట్టాడుతుంది.. ఇలా పీచు పరిశ్రమ విలవిల్లాడుతోంది.. టన్నుల కొద్దీ పేరుకుపోతున్న కొబ్బరి డొక్క రైతులకు శిరోభారంగా మారింది. అత్యంత విలువైన డొక్క కొంత రోడ్ల వెంబడి, తోటల్లో చెత్తగా మారిపోతుండగా, మరికొంత అగ్నికి ఆహుతవుతోంది.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పీచు పరిశ్రమ అత్యంత పెద్దది. కొబ్బరి సాగు జరుగుతున్న ప్రాంతాల్లో పీచు, దాని అనుబంధ ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు భారీ ఎత్తున ఉన్నాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 1.80 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతుండగా, ఒక్క డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోనే 1.10 లక్షల ఎకరాలు ఉంది. ఇక్కడ కొబ్బరి అనుబంధ పరిశ్రమల్లో క్వాయర్ ఉత్పత్తులది అగ్రస్థానం. విలువ ఆధారిత పరిశ్రమల్లో 80 శాతం క్వాయర్ ఆక్రమించింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1,200 వరకూ చిన్న, పెద్దా పీచు ఉత్పత్తి కేంద్రాలు ఉంటే, ఒక్క ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 740 వరకూ పీచు, తాళ్ల ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో పీచు ఉత్పత్తి కేంద్రంలో రోజుకు టన్ను నుంచి ఐదు టన్నుల వరకూ పీచు ఉత్పత్తి అవుతుంది. ఏడాదికి ఉమ్మడి తూర్పుగోదావరి నుంచి రూ.125 కోట్ల విలువైన పీచు, ఇతర ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయని అంచనా. ఎగుమతుల్లో సింహభాగం అంటే 70 శాతం చైనాకు వెళ్తుండగా, మిగిలిన ఎగుమతి మలేషియా, సింగపూర్, జపాన్‌తోపాటు గల్ఫ్, యూరప్ దేశాలకు ఉంటుంది.



మామిడికుదురు మండలం పాశర్లపూడిలంకలోని కొబ్బరి తోటలో పేరుకుపోయిన డొక్క



కొబ్బరి తోటలో డొక్కను తగలబెడుతున్న రైతులు

అంతకంతకూ పతనం

ప్రస్తుతం కొబ్బరి కాయ ధర రూ.22 పలుకుతోంది. కానీ విచిత్రంగా కొబ్బరి పీచు ధరలు మాత్రం పతనమయ్యాయి. ఎగుమతులూ తగ్గాయి. తడి పీచు కిలో రూ.ఆరు పలుకుతుండగా, పొడి పీచు రూ.8 వరకూ ఉంది. తడి పీచు ఎండబెట్టి బేళ్లుగా మార్చి విక్రయిస్తే కిలో రూ.12 వరకూ వస్తోంది. కానీ పెట్టుబడి వ్యయం పెరగడంతో గిట్టుబాటు కావడం లేదు. తడి పీచు సగటు ధర కిలో రూ.తొమ్మిది వరకూ ఉండగా, ఇప్పుడు రూ.ఆరుకు చేరింది. చివరకు కొబ్బరి తాళ్ల ధరలు సైతం తగ్గాయి. 24 అడుగుల 100 ముక్కల కట్ట హైదరాబాద్ మార్కెట్‌లో రూ.150 మాత్రమే ఉంది. గతంలో ఇది రూ.220 వరకూ పలికేది. ముంబయికి వెళుతున్న తాళ్లకు మాత్రం రూ.180 వరకూ వస్తోంది.

పెరిగిన ఉత్పత్తి వ్యయం

ఇటీవల కాలంలో పీచు, తాళ్లు, కొబ్బరి పొట్టు వంటి ఉత్పత్తి వ్యయం గణనీయంగా పెరిగింది. పీచు పరిశ్రమ నష్టాలకు ఇది కొంత కారణమవుతోంది. ఒక్క కార్మికుడికి రోజు వేతనం రూ.600 వరకూ ఉంది. ఆధునిక యంత్రాలు వచ్చిన తరువాత కార్మికుల సంఖ్య తగ్గిందని, కానీ వారికి చెల్లించే జీతం పెరిగిందని ఉత్పత్తిదారులు చెబుతున్నారు.



అమ్మకాలు లేక పరిశ్రమ వద్ద పేరుకుపోయిన పీచు

విద్యుత్ బిల్లుల షాక్

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పీచు పరిశ్రమల యజమానులకు విద్యుత్ చార్జీల షాక్ తగులుతోంది. యూనిట్ విద్యుత్ ధర రూ.ఆరు. కానీ అదనపు లోడు వినియోగం, ఇంధన చార్జీలు, అపరాధ రుసుం పేరుతో ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారు. యూనిట్ ధర రూ.10 నుంచి రూ.12 వరకూ కావడంతో ఉత్పత్తి వ్యయం పెరిగింది. నాలుగు వేల యూనిట్లు వచ్చే మధ్య తరహా పరిశ్రమకు రూ.24 వేల విద్యుత్ బిల్లు రావాల్సి ఉండగా, కొంతమందికి రూ.40 వేల వరకూ వస్తోంది.

ఎక్కడికక్కడే పేరుకుపోయి..

రెండు నెలల కిందట టన్ను కొబ్బరి డొక్కను స్థానిక పీచు ఉత్పత్తిదారులు రూ.1,500కు కొనుగోలు చేశారు. ఇప్పుడు కొనుగోలు నిలిచిపోవడంతో కొబ్బరి తోటల్లో డొక్క టన్నుల కొద్దీ ఉండిపోయింది. ఈ డొక్కను ఉచితంగా తీసుకు వెళ్లాలని రైతులు పరిశ్రమల యజమానులను వేడుకుంటున్నారు. అవసరమైతే ట్రాక్టర్‌కు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకూ ఎదురిచ్చి వదిలించుకునే పనిలో పడ్డారు. ఇదే సమయంలో తమిళనాడులో కొబ్బరి ఉత్పత్తి తగ్గడం వల్ల అక్కడ పీచు పరిశ్రమల యజమానులు రాష్ట్రంలోని చిత్తూరు, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల నుంచి డొక్క కొనుగోలు చేసి తీసుకు వెళ్తుండడం గమనార్హం. ఇక్కడ తోటల్లో పేరుకుపోయిన డొక్కను నిర్జీవ ప్రాంతాలకు తరలించడం, లేకుంటే తగలబెట్టడం చేస్తున్నారు.

భారీ పరిశ్రమలు రావాలి



పీచు పరిశ్రమ నిలదొక్కుకోవాలంటే జిల్లాలో భారీ పరిశ్రమలు రావాలి. ఒక్కో పరిశ్రమ వద్ద పలు రకాల విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు కావాలి. ప్రతి మండలంలో క్వాయర్ క్లస్టర్ ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం ప్రైమిస్టర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పీఎంఈజీపీ)లో ఇప్పుడు రూ.50 లక్షల వరకూ రాయితీతో కూడిన రుణం ఇస్తుంది. ఇది కనీసం రూ.కోటికి పెంచాలి. అప్పుడు పలు రకాల ఉత్పత్తులు తయారు చేయవచ్చు.

– వేగి వెంకటేశ్వరరావు, డైరెక్టర్, కోనసీమ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ డైరెక్టర్

యాంత్రీకరణ అవసరం



తమిళనాడు పీచు ఉత్పత్తిదారులు ఒక్కడి కొబ్బరి డొక్కను కొనుగోలు చేసి పీచు ఉత్పత్తి చేస్తున్నారు. కొనుగోలు, రవాణా ఖర్చులు భారమే అయినా వారికి లాభాలు వస్తున్నాయి. మన పీచు ఉత్పత్తిదారులకు ఆధునిక యంత్రాలు లేక లాభాలు రావడం లేదు. స్థానికంగా ఉత్పత్తి తగ్గడం వల్ల రైతుల వద్ద డొక్క వృథాగా పేరుకుపోతోంది. దీనిపై ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపాలి.

– పెదమల్లు నాగబాబు, క్వాయర్ రంగ నిపుణుడు, పాశర్లపూడిలంక

బుద్ధుని బోధనలతో ప్రపంచ శాంతి

మాజీ మంత్రి సూర్యారావు



అమలాపురం త్రిరత్న బుద్ధ విహార్‌లో బుద్ధుని విగ్రహానికి పూజలు చేస్తున్న సూర్యారావు

అమలాపురం రూరల్: గౌతమ బుద్ధుని బోధనలతో ప్రపంచ శాంతి సిద్ధిస్తుందని బుద్ధ విహార్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ మంత్రి, రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు అన్నారు. గురువారం అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో ఆషాఢ బుద్ధ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. తొలుత బుద్ధుని విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ దలైలామా వారసుల ఎంపికలో చైనా పాత్ర ఉండని, దాని సర్వాధికారం దలైలామాదేనని అన్నారు. దాలైలామా మరణానంతరమే వారసులను ఎంపిక చేస్తారన్నారు. మానవాళి హింసను వీడి శాంతి మార్గం వైపు పయనించాలని గౌతమ బుద్ధుడు బోధించారన్నారు. బుద్ధ విహార్ జనరల్ సెక్రటరీ డీబీ లోక్, కమిటీ చైర్మన్ నాగాబత్తుల ప్రసాదరావు, ప్రతినిధులు పెనుమాల చిట్టిబాబు, కాశి వెంకట్రావు, దోనుపాటి నాగేశ్వరరావు, ఈవీవీ సత్యనారాయణ, బత్తుల రాజన్‌బాబు, కోడూరి శ్రీరామ్మూర్తి, గోసంగి ఆనందరావు, దోనుపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనుచరుల నుంచి రక్షణ కల్పించండి



అనపర్తి ఏరియా ఆసుపత్రి వద్ద ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు తన గోడు వెళ్లబోసుకుంటున్న సత్తిబాబు

అనపర్తి: తన భార్య కొమ్ము బుజ్జిపై హత్యాయత్నం చేసిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు దుప్పలపూడి గ్రామానికి చెందిన నల్లమిల్లి వెంకటరెడ్డి(ఎన్వీ), అతని అనుచరుల నుంచి రక్షణ కల్పించాలని బాధిత మహిళ భర్త సత్తిబాబు అన్నారు. గురువారం పరామర్శకు వచ్చిన ఎమ్మెల్సీ బొమ్ము ఇజ్రాయిల్ వద్ద ఆయన తమ గోడు చెప్పుకున్నారు. తనకు జరిగిన అన్యాయాన్ని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి చెప్పుకోవడానికి ఉదయం రామవరంలోని ఆయన ఇంటికి వెళ్లగా ఎమ్మెల్యే తన వద్ద ఉన్న ఫోన్ లాక్కుని దానిలో ఉన్న ఫొటో, వీడియో ఆధారాలను డిలీట్ చేసి సాయంత్రం ఫోన్ తిరిగి ఇచ్చారని సత్తిబాబు ఆరోపించారు. దీనిపై ఎక్కడికైనా వచ్చి ప్రమాణం చేస్తానని ఇజ్రాయిల్ వద్ద సత్తిబాబు వాపోయారు. నెల రోజుల క్రితం కుక్కను తప్పించే క్రమంలో తన తోడల్లుడు వీరబాబు వృద్ధుడిని బైక్‌తో ఢీకొట్టాడని, ఆయన మృతి చెందడంతో పోలీసులు కేసు నమోదు చేయగా వీరబాబు బెయిల్‌పై బయటకు వచ్చారన్నారు. పది రోజులుగా మాజీ సర్పంచ్ కుమారుడు ఎన్వీ విపరీతంగా వేధిస్తున్నాడని, దీంతో ఎన్వీ ఇంటికి వెళ్లగా రూ.2 లక్షలు ఇవ్వకపోతే వీరబాబును చంపేస్తామని బెదిరించారని చెప్పారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళ్లిన తన భార్య బుజ్జి, వీరబాబుపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సత్తిబాబు డిమాండ్ చేశారు.

ఆలయ అభివృద్ధికి రూ.5.50 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న దాత సాయికుమార్

ఆలమూరు: చింతలూరులో నూకాంబిక అమ్మవారి ఆలయ అభివృద్ధికి దాతలు విరాళాలు అందిస్తున్నారు. ఆలయంలో ప్రస్తుతం జరుగుతున్న రాజగోపురాల నిర్మాణం కోసం తమ వంతు సాయంగా మండపేటకు చెందిన పారిశ్రామికవేత్త వంక సాయికుమార్ బాబు గురువారం దేవదాయ శాఖకు రూ.5.50 లక్షల విరాళాన్ని అందజేశారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు అల్లంరాజు రామకృష్ణ మూర్తి, వైట్ల శేషుబాబు, నీటి సంఘం చైర్మన్ వైట్ల గంగరాజు, గన్ని వెంకట్రావు పాల్గొన్నారు.

షంపద సృష్టికి పర్మిట్!



- ఇప్పటికే ఏరులై పారుతున్న మద్యం
- అనధికారిక బెల్ట్ షాపులతో విచ్చలవిడిగా విక్రయాలు
- వాటిని ఇంకా పెంచేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు

సాక్షి, రాజమహేంద్రవరం: సంపద సృష్టించేందుకు కూటమి సర్కారు అడ్డదారులు తొక్కుతోందా..? మద్యం దుకాణాల పక్కన పర్మిట్ రూమ్‌లకు అనుమతులు ఇచ్చి రూ.కోట్లు కొల్లగొట్టేందుకు సన్నాహాలు ప్రారంభించిందా..? తద్వారా ప్రజలను మరింతగా తాగుడుకు బానిసలు చేసేందుకు కుట్రలు పన్నుతోందా..? అంటే అవుననే సమాధానం వస్తోంది ప్రజల నుంచి. మద్యం షాపులకు అనుగుణంగా పర్మిట్ రూమ్‌లు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విచ్చలవిడిగా జరుగుతున్న మద్యం విక్రయాలతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నామని, ఇక షాపుల పక్కనే తాగిస్తే.. తాగుబోతుల వీరంగాన్ని భరించలేమంటూ ఆందోళన చెందుతున్నారు.

ఇదీ సంగతి..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతన మద్యం పాలసీ తెరపైకి తెచ్చింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడచిన మద్యం షాపులను పూర్తిగా ఎత్తివేసి ప్రైవేటు పేరుతో కూటమి నేతలకు కట్టబెట్టింది. ఇదే అదనుగా భావించిన కూటమి నేతలు రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. రూ.లక్షల ఆదాయం ప్రభుత్వానికి వస్తోంది. రూ.99కే క్వార్టర్ మద్యం బాటిళ్లను అందుబాటులోకి తెచ్చి ప్రజలను తాగుబోతులుగా సర్కారు మార్చేసింది.

పర్మిట్ రూమ్‌లకు గ్రీన్ సిగ్నల్

మద్యం ద్వారా ప్రస్తుత ఆదాయం చాలదన్నట్లు మరింతగా పెంచుకునేందుకు అడుగులు వేస్తోంది. మద్యం దుకాణాల వద్దే పర్మిట్ రూమ్‌లకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. మద్యం విక్రయాల ద్వారా వస్తున్న ఆదాయాన్ని పెంచుకునే క్రమంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉన్న పర్మిట్ రూమ్‌ల విధానాన్ని తిరిగి ప్రవేశ పెట్టేందుకు ఎక్సైజ్ శాఖ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ నెలాఖరులోపు దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌ల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని ఎక్సైజ్ శాఖ భావిస్తోంది.

జిల్లాలో 62 కోట్ల ఆదాయం

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 125 మద్యం షాపుల నిర్వహణకు అబ్కారీ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనికి అనుబంధంగా ఒక్కో షాపునకు ఒక్కో పర్మిట్ రూమ్ చొప్పున 125 సిట్టింగ్ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. పర్మిట్ రూమ్‌లకు ప్రభుత్వం ధర నిర్ణయించింది. కార్పొరేషన్, మున్సిపాలిటీ పరిధిలో మద్యం షాపునకు అనుగుణంగా ఏర్పాటు చేసుకునే పర్మిట్ రూమ్‌కు రూ.7.50 లక్షలు, ఇతర ప్రాంతాల్లోని పర్మిట్ రూమ్‌లకు రూ.5 లక్షల చొప్పున ఫీజును ప్రభుత్వం ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. సగటున ఒక్కో షాపునకు రూ.5 లక్షలు వసూలు చేసినా.. ప్రభుత్వానికి అదనంగా రూ.62 కోట్ల ఆదాయం ఏటా సమకూరనుంది. గతంలో టీడీపీ అధికారంలో ఉండగా.. అన్ని పర్మిట్ దుకాణాలకు ఏడాదికి రూ.5 లక్షలు పర్మిట్ రూమ్ ఫీజుగా ఉండేది. ఇప్పుడు దానిని రెండు కేటగిరీలుగా మార్పు చేస్తున్నారు. దుకాణాల పక్కన పర్మిట్ రూమ్‌లకు అవకాశం కోసం మద్యం దుకాణ యజమానులు ఇప్పటికే ప్రయత్నాలు చేస్తున్నారు.



చాగల్లు ఐఎంఎల్ డిపో నుంచి మద్యం తీసుకెళుతున్న వ్యాపారులు (ఫైల్)

నూతన పాలసీతో ఇప్పటికే రూ.కోట్లలో ఆదాయం

నూతన మద్యం పాలసీతో ఇప్పటికే ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లల్లో ఆదాయం లభించింది. జిల్లా వ్యాప్తంగా 125 షాపులకు 4,384 దరఖాస్తులు అందాయి. ఒక్కో టెండర్‌కు రూ.2 లక్షలు వసూలు చేశారు. అంటే రూ.87.68 కోట్ల ఆదాయం వచ్చింది. షాపులు దక్కించుకున్న వ్యాపారులు ఆరు విడతల్లో లైసెన్సు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. వార్షిక లైసెన్సు ఫీజులో 1/6 వంతు చెల్లించారు. దీని ద్వారా రూ.14.85 కోట్ల ఆదాయం వచ్చింది.

మద్యం విక్రయాల్లోనూ దూకుడే..

మద్యం షాపుల ద్వారానే కాకుండా.. మద్యం విక్రయాల్లోనూ ప్రభుత్వానికి రూ.కోట్లల్లో ఆదాయం సమకూరుతోంది. రాజమహేంద్రవరం రూరల్ ఐఎంఎల్ డిపో పరిధిలో తూర్పుగోదావరి జిల్లాలోని రాజానగరం, రాజమహేంద్రవరం సిటీ, రూరల్, అల్లూరి సీతారామరాజు, కోనసీమ జిల్లాల పరిధిలోని 134 మద్యం షాపులు, 27 బార్ అండ్ రెస్టారెంట్లకు మద్యం, బీర్లు సరఫరా చేస్తున్నారు. ప్రతి నెలా దాదాపుగా 1.17 లక్షల వివిధ రకాల మద్యం కేసులు, 44,300 బీర్ కేసులు సరఫరా చేస్తుంటారు. వీటి విలువ రూ.103 కోట్లు.

- చాగల్లు ఐఎంఎల్ డిపో పరిధిలో తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం, ఏలూరు పరిధిలో 111 షాపులు, 10 బార్లకు మద్యం సరఫరా అవుతోంది. ప్రతి నెలా సుమారు 43,743 మద్యం కేసులు, 13,354 బీర్ కేసులు సరఫరా చేస్తున్నారు. వీటి ద్వారా రూ.కోట్లలో ఆదాయం లభిస్తోంది.

తాగినోళ్లకు తాగినంత..

ఇప్పటికే మద్యం అక్రమ విక్రయ దందా బెల్టు షాపులే కేంద్రంగా నడుస్తోంది. సింహభాగం మద్యం షాపులను హస్తగతం చేసుకున్న కూటమి నేతల సిండికేట్ మద్యం దుకాణాలకు అనుగుణంగా బెల్టు షాపులు తెరిచింది. పట్టణం, పల్లె అన్న తేడా లేకుండా ఎక్కడికక్కడ దుకాణాలు వందల సంఖ్యలో వెలిశాయి. అనధికారిక విక్రయాల కోసం ఏకంగా వేలం పాటలు నిర్వహించి మరీ ఎవరు ఎక్కడ విక్రయించాలో సిండికేటే నిర్ధారించింది. ఒక్కో బెల్ట్ షాపునకు డిపాజిట్‌గా ఆ ప్రాంతం, వ్యాపారాన్ని బట్టి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు డిపాజిట్ వసూలు చేశారు. మద్యం దుకాణాలు లేని ప్రధాన కూడళ్లలో, మారుమూల గ్రామాల్లో బెల్ట్‌షాపులు, డోర్ డెలివరీ మద్యం విక్రయాలు జోరందుకున్నాయి. గుడి, బడి అన్న తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ విక్రయించేస్తున్నారు. మద్యం దుకాణం దక్కించుకున్న వ్యాపారే సరుకు ఇస్తుండటంతో బెల్ట్ షాప్ నిర్వాహకులు తమకు ఇష్టమొచ్చిన ధరకు విక్రయిస్తున్నారు. దీనికితోడు ప్రభుత్వం నేరుగా పర్మిట్ రూమ్‌లకు అనుమతులు ఇస్తుండటంతో అసాంఘిక కార్యక్రమాలు విస్తృతంగా జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

సుగుణారెడ్డికి రెడ్‌క్రాస్ పురస్కారం



గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న డాక్టర్ సుగుణారెడ్డి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్, రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ డాక్టర్ సుగుణారెడ్డికి రెడ్‌క్రాస్ సొసైటీ ఉత్తమ పురస్కారం అందజేసింది. విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి రెడ్‌క్రాస్ వార్షిక సమావేశంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. కాకినాడ రెడ్‌క్రాస్‌ను ప్రథమ స్థానంలో నిలపడంలో కృషి చేస్తున్న సుగుణారెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు. అత్యధిక స్థాయిలో ఆదిత్య యూనిట్స్ ద్వారా రక్తదాన శిబిరాలు నిర్వహించి, సమాజ సేవలో ముందుంటున్నారని రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు తెలిపారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	23,000 - 23,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 - 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	26,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	25,500
గటగట (వెయ్యి)	24,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	19,000 - 20,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	19,000 - 20,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

పురపాలక సంఘ కార్యాలయం

ఆర్.ఓ.సి నెం.537/2025-ఎ1 అమలాపురం, ది. 01.07.2025.

బహిరంగ వేలం నోటీసు

అమలాపురం పురపాలక సంఘమునకు చెందిన సర్క్యులర్ బజార్ నందలి ప్రధాన కూడలి నందు వ్యాపారమునకు అత్యంత అనుకూలముగా వున్న శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, గ్రౌండ్ ఫ్లోర్ నందలి షాపు నెం. 3, 4, 8, 16, 48, మరియు మొదటి అంతస్తు నందలి బ్లాక్-ఎ2, బ్లాక్-ఎ02, సర్క్యులర్ బజార్ వెనుక నందలి చిన్న షాపు 7 ను మూడు సంవత్సరముల కాల పరిమితికి లీజుకిచ్చుటకు గాను ది.16.07.2025వ తేది బుధవారం ఉదయం 11.00 గంటలకు మున్సిపల్ కార్యాలయం నందు కమీషనరు గారిచే గాని లేదా వారి అనుమతి పొందిన అధికారిచే గాని బహిరంగ వేలం నిర్వహించబడును. కావున ఆసక్తి కల్గిన అభ్యర్థులు సదరు బహిరంగ వేలం పాటలో పాల్గొనవలసినదిగా ఆహ్వానించడమైనది. పాటలో పాల్గొనదలచిన అభ్యర్థులు పురపాలక సంఘం వారు పొందు పర్చిన లీజు షరతులకు మరియు నియమ నిబంధనలకు బద్ధులై వుండవలెను. ఇతర వివరములకు కార్యాలయ పని వేళలలో రెవెన్యూ విభాగము నందు పొందగోరడమైనది.

(సం) వి.నిర్మల్ కుమార్, కమిషనరు
అమలాపురం పురపాలక సంఘం

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DISTANCE EDUCATION
■ ఓపెన్ టెన్త్, ఇంటర్ వన్ సిట్టింగ్, డిగ్రీ, పీజీ, సైన్స్ & ఆర్ట్స్ MBA, MCA అన్ని యూనివర్సిటీల పరీక్షలు మా కాకినాడ విద్యాసంస్థల, కాకినాడ దగ్గరలోని గొల్లపాలెంలో జరుగును. 100% పాస్ గైడెన్స్, మా ఆఫీసులు : కాకినాడ, రాజమండ్రి, రావులపాలెం. ఫోన్: 82975 92043, 99494 82757 [V- 2829]

Services

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 81422 37635 [B-2639]

Wanted
■ ఆపరేషన్ థియేటర్‌లో అనుభవము కలిగిన నర్సులు మరియు కాంపౌండర్స్ కావలెను. ప్రగతి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ప్రకాష్‌నగర్ మెయిన్‌రోడ్, రాజమండ్రి [R-247]

■ వ్యాన్ డ్రైవర్స్ కావలెను. జీతం : రూ.15,000/- + డైలీ రూ.100/-. శ్రీదేవి హోండా. ఆథరైజ్డ్ డీలర్ : హోండా టూ వీలర్స్, టూ టౌన్ పోలీస్‌స్టేషన్ దగ్గర, మెయిన్‌రోడ్, కాకినాడ. Ph: 94909 98888 [R-48]

■ Wanted Sales Manager and assistant sales manager in popular mobile stores are preferable. Ph.No: 9133399257, 9703333378 [G-145]

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవ దానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP& డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం. Hyd.9014885406 [HA-15968]

■ Wanted Male Counselors, Cashier cum Computer Operators and Administrative Staff, Qualification Any Degree, Age Limit: 25 to 45 years, Salary upto: 20000/-. Working Location: Master Minds College, Rajahmundry, Contact: 92487 33370 [G-6085]

■ స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9963521122, 9963101122 [B-1275585]

■ వెంటనే కావలెను. ESM సెక్యూరిటీ గార్డ్‌లు BPCL, వాకాలపూడి, కాకినాడ (ఆం.ప్ర.). R.త్యాగరాజన్ సెక్యూరిటీ ఏజెన్సీ ఖాళీలు: 05, నెట్ శాలరీ (27 రోజులు): 22,546/- EPF: 3,750/-, శ్రీ గజేంద్ర పంత్రి, మొబైల్: Ph: 7415864502 / 9301165831 [DA-1601]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్స్: 0883-2483010

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కష్టాలు కొనసాగేలా..

- ఎరువులు అందక అన్నదాతకు తిప్పలు
- నిరుపయోగంగా రైతు సేవా కేంద్రాలు
- సాగు కాలం మొదలైనా కానరాని సన్నద్ధత



ఖరీఫ్ దమ్ము పనులు చేస్తున్న రైతు

కొత్తపేట: తొలకరి పలకరించింది.. ఖరీఫ్ సాగుకు ఆహ్వానం పలికింది.. ఎన్నో ఆశలతో ప్రతి రైతు అడుగు పొలాల వైపు పడింది.. వరి నారుమడులు, పొలాల దమ్ము పనుల్లో రైతాంగం నిమగ్నమైంది. ఇలా సాగు ఊపందుకుంటుంటే, ప్రభుత్వం నుంచి సన్నద్ధత కరవైంది. నేటికీ రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు మాత్రం అందించడం లేదు. ఎరువులు ఎప్పుడు వస్తాయో తెలియక రైతులు ఆ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయ, రైతు ప్రోత్సాహక పథకాలను అందించేవారు. విత్తనాలు, ఎరువులు, పంటల బీమా, తదితర సేవలు సకాలంలో అందించేవారు. ముందుగానే సర్వం సిద్ధం చేసేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలకు రైతు సేవా కేంద్రాలు (ఆర్‌ఎస్‌కే)గా పేరుపెట్టి వాటి ద్వారా సేవలకు మాత్రం మంగళం పాడింది. ఇవి ప్రస్తుతం అలంకారప్రాయంగా మిగిలాయని రైతులు అంటున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం సుమారు 1,74 లక్షల ఎకరాలు. ఈ సీజన్‌లో యూరియా, కాంప్లెక్స్, డీఏపీ, ఎంఓపీ, సూపర్ ఎరువులు సుమారు 45,775 మెట్రిక్ టన్నుల అవసరం ఉంది. అయితే ఇంకా రైతు సేవా కేంద్రాలకు ఎరువులు రాలేదు. ఎప్పుడొస్తాయో తెలియడం లేదు.



కొత్తపేట మండలం గంటిలో రైతు సేవా కేంద్రం

ముందస్తు అంటూ.. నిర్లక్ష్యం చూపుతూ

ముందస్తు సాగుకు వెళ్లాలని అధికారులు చెబుతూనే రైతులకు సకాలంలో సేవలు అందించడంలో నిర్లక్ష్యం చూపుతున్నారు. దీనివల్ల సాగు పంట ఆలస్యమవుతుంది. దీనివల్ల పంట చేతికొచ్చే సమయంలో అంటే అక్టోబర్, నవంబర్ మాసాల్లో తుపాన్లు, భారీ వర్షాలకు పంట తడిసిపోయి ఇబ్బందులు పడాల్సి వస్తుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పక్కాగా ముందస్తు సాగుకు చర్యలు తీసుకునేది. ఇందులో భాగంగా ముందుగానే సాగు నీరు విడుదల చేసేది. సకాలంలో రాయితీపై విత్తనాలు, రసాయన ఎరువులు అందించేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని గాలికొదిలేసింది. అన్నదాత సుఖీభవ ద్వారా పెట్టుబడి సాయం ఇవ్వలేదు. గత రబీ ధాన్యం కొనుగోలు చేసి రెండు నెలలు దాటినా నేటికీ ఆ డబ్బులు రైతుల ఖాతాలకు జమ చేయలేదు. ఇటువంటి పరిస్థితుల్లో ఖరీఫ్ ప్రారంభమైనా, రైతు సేవా కేంద్రాల (ఆర్‌ఎస్‌కే) ద్వారా ఇంకా రాయితీపై విత్తనాలు, ఎరువులు అందించడం లేదు.

ప్రైవేట్ డీలర్ల హవా

ప్రస్తుతం నాట్లు వేసే సమయం. యూరియా, డీఏపీ అత్యవసరం. ఆర్‌ఎస్‌కేల వద్ద ఎరువులు అందుబాటులో లేవు. ఈ పరిస్థితుల్లో ప్రైవేట్ డీలర్ల వద్ద కూడా దొరకడం లేదు. కొంతమంది వద్దే స్టాక్ ఉంది. తప్పక ఆ షాపులకు వెళితే ఎంఆర్‌పీ రూ.265 ఉన్న యూరియా బస్తా రూ.320 చెబుతున్నారని రైతులు అంటున్నారు. ఇదేంటని అడిగితే తామే రూ.290కి కొనుగోలు చేశామని, రూ.30 కిరాయి, రూ.5 దిగుమతి చార్జి కలిపి మొత్తం రూ.325 అయ్యిందని అంటున్నారని వాపోతున్నారు. పైగా అవసరం లేకపోయినా యూరియాతో పాటు దానికి అనుసంధానంగా జింకు, సల్ఫర్ వంటి మందులు అంటగడుతున్నారని చెబుతున్నారు.

అధిక ధరకు విక్రయాలు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు అందించేవారు. ఉన్న ఊళ్లోనే సేవలు అందేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎరువులు అందుబాటులో లేకుండా చేసింది. ప్రస్తుతం అన్ని ప్రైవేట్ షాపుల్లో ఎరువులు దొరకడం లేదు. ఉన్న షాపుల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

–పెదపూడి బాపిరాజు, అధ్యక్షుడు, కొత్తపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ రైతు విభాగం

ఎరువుల సరఫరాకు చర్యలు



గ్రామాల్లో సాగు విస్తీర్ణానికి అనుగుణంగా ఎరువులు ఇండెంట్‌ను గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏ) పెట్టాలి. ప్రస్తుతం వీఏఏల బదిలీలు జరుగుతున్నాయి. రెండు, మూడు రోజుల్లో ఆ ప్రక్రియ ముగుస్తుంది. వీఏఏలు చేరిన వెంటనే ఎరువుల ఇండెంట్ పెట్టించి, రైతులకు కావాల్సిన ఎరువుల సరఫరాకు చర్యలు తీసుకుంటాం. ఈ లోపు పలు సొసైటీల ద్వారా సరఫరా చేయిస్తున్నాం.

–ఎం.వెంకటరామారావు, ఏడీఏ, కొత్తపేట

రక్షణ కల్పించాలని ప్రజల ఆందోళన



డ్రిల్లింగ్ సైట్ వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

మామిడికుదురు: ఓఎన్జీసీ డ్రిల్లింగ్ బావి వద్ద బుధవారం జరిగిన గ్యాస్ కిక్ సంఘటన నేపథ్యంలో స్థానికులు గురువారం ధర్నా చేశారు. తమకు రక్షణ కల్పించాలంటూ ఆందోళన చేపట్టారు. పాశర్లపూడి – పాశర్లపూడిలంక గ్రామాల సరిహద్దులోని డ్రిల్లింగ్ నిర్వహిస్తున్న రిగ్ వద్ద ఈ ధర్నా జరిగింది. ఓఎన్జీసీ కార్యకలాపాలతో అనుక్షణం తాము భయం, భయంగా గడుపుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఎక్కడో కూర్చుని పరిస్థితి అదుపులో ఉందని చెప్పడం ఏంటంటూ నిరసన తెలిపారు. డ్రిల్లింగ్ జరుగుతున్న ప్రాంతానికి వచ్చి ప్రజలకు తగిన వివరణ, భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అక్కడ చేపట్టిన రిపేర్స్ పనులను అడ్డుకున్నారు. ఈ నిరసనలో మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, పొన్నమండ రామస్వామి, బిరుదుగంటి నరసింహమూర్తి, మోకా దుర్గారావు, అడబాల దొరబాబు, గోనిపాటి మధుబాబు, తాడి శ్రీనివాసు, రొక్కాల రాజశేఖర్, పాలమూరి గోపాల్, ఉండ్రు చిన్న, నాగిడి వీరవెంకటరమణ, కోలా సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరి.. భక్తజన ఝరి



ఆలయ ప్రాంగణంలో వ్యాస మహర్షి చిత్రపటంతో ఊరేగింపు

అన్నవరం: స్థానిక సత్యదేవుని సన్నిధిలో వ్యాసపూర్ణిమ (ఆషాఢ పూర్ణిమ) వేడుకలను గురువారం నిర్వహించారు. దర్బారు మండపంలో వ్యాస మహర్షికి పండితులు ప్రత్యేక పూజలు చేశారు. వ్యాస మహర్షి చిత్రపటంతో ఆలయ ప్రాంగణంలో మూడు సార్లు ప్రదక్షిణలు చేశారు. అనంతరం నీరాజనమంత్ర పుష్పాలు సమర్పించి ప్రసాదాలు అందజేశారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు, దేవస్థానం వేదపండితులు పాల్గొన్నారు. ఏఈఓ కృష్ణారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా వ్యాస పూర్ణిమ సందర్భంగా సుమారు 20 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి వ్రతాలు వెయ్యి జరగ్గా, అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. సుమారు నాలుగు వేల మంది భక్తులు నిత్యాన్నదాన పథకంలో స్వామివారి ప్రసాదం స్వీకరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ ముఠా అరెస్ట్



చోరీ వివరాలు వెల్లడిస్తున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, సీఐ నాయక్

దేవరపల్లి: పొలాల్లోని వ్యవసాయ మోటార్ల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలిస్తున్న అంతర జిల్లా చోరీ ముఠాను దేవరపల్లి పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వారి పలు ట్రాన్స్‌ఫార్మర్లు, 65 రాగి దిమ్మలను, 116.600 కిలోల రాగి తీగతో పాటు రెండు కార్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం దేవరపల్లి పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ ఆ వివరాలు వెల్లడించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని వీరవాసరం మండలం రాయకుదురుకు చెందిన కడలి సతీష్, ఏలూరు జిల్లా కృతివెన్ను మండలం లక్ష్మీపురానికి చెందిన వేండ్రపు దుర్గాశ్రీనివాస్, పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం మంచిలికి చెందిన బళ్లా విజయరత్నం, భీమవరం మండలం దెయ్యాలతిప్పకు చెందిన ఏలూరి పోసయ్య ముఠాగా ఏర్పడి రెండు కార్లు సెల్ఫ్ డ్రైవింగ్ కోసం అద్దెకు తీసుకున్నారు. వీరి వద్ద ఉన్న రెండు బైక్‌లతో ఉదయం సమయాల్లో రెక్కీ నిర్వహించి, రాత్రి పూట ట్రాన్స్‌ఫార్మర్లను బద్దలు కొట్టి వాటిలోని రాగి తీగను దొంగిలించేవారు. ఇలా తూర్పు, పశ్చిమగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో 115 ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేశారు. అందులోని రాగి తీగను భీమవరం మండలం గొల్లవానితిప్పకు చెందిన పావురాయల కోటేశ్వరరావు, దిరుసుమర్రుకు చెందిన సవరపు భీమారావులు కొనుగోలు చేసి తీగను కరిగించి దిమ్మలుగా తయారు చేసి విక్రయిస్తున్నారు. నిందితులు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2023లో 49 ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలించి చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో అరెస్ట్ కాగా, ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారు. ఇప్పటి వరకూ వివిధ జిల్లాల్లో 115 ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలించగా, 67 కేసులు నమోదయ్యాయి. ఇటీవల కాలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు ఎక్కువగా జరుగుతుండడంతో జిల్లా ఎస్పీ, రాజమహేంద్రవరం సీసీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాల సహాయంతో ఆ ముఠాను బుధవారం సాయంత్రం దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద దేవరపల్లి ఎస్సై వి.సుబ్రహ్మణ్యం, సిబ్బంది పట్టుకుని అరెస్ట్ చేశారన్నారు. చోరీ సొత్తు విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని చెప్పారు. ఈ ముఠాను పట్టుకోవడానికి సహకరించిన రాజమహేంద్రవరం సీసీఎస్ సిబ్బంది, దేవరపల్లి స్టేషన్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. దేవరపల్లి సీఐ బీఎన్ నాయక్, రాజమహేంద్రవరం సీసీఎస్ సీఐ శ్రీధర్, బాలశౌరీ తదితరులు పాల్గొన్నారు.

గోదారి ఇబ్బందులు



రేవులో పడవపై వెళ్తున్న లంక గ్రామాల ప్రజలు



బూరుగులంక రేవులో వరద ఉధృతికి కొట్టుకుపోయిన తాత్కాలిక రహదారి

- జి.పెదపూడిలో వరద ఉధృతి
- కొట్టుకుపోయిన తాత్కాలిక రహదారి
- నాలుగు లంక గ్రామాలకు మార్గం కట్

పి.గన్నవరం: వరద వచ్చేసింది.. నీటి ప్రవాహం ఉధృతమవుతోంది.. లంక వాసులకు కష్టాలు తెచ్చిపెడుతోంది.. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరి నదీపాయల్లో వరద ఉధృతి పెరిగింది. ఈ నేపథ్యంలో పి.గన్నవరం మండలం బూరుగులంక రేవు వద్ద నాలుగు లంక గ్రామాల ప్రజల రాకపోకల కోసం గతేడాది వశిష్ఠ నదీపాయలో తాత్కాలికంగా నిర్మించిన రహదారి గురువారం ఉదయం వరద ప్రవాహానికి కొట్టుకుపోయింది. దీంతో ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఈ గ్రామాల్లో సుమారు 3 వేల మంది నివసిస్తున్నారు. గతంలో 200 మీటర్ల పొడవున మట్టితో నిర్మించిన తాత్కాలిక రహదారి వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో రేవులో రెండు ఇంజిన్ పడవలను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు పడవలపై రాకపోకలు ప్రారంభించారు. అలాగే వరద ఉధృతికి ఊడిమూడిలంక వద్ద మట్టి లారీల రాకపోకల కోసం నిర్మించిన రహదారి, యర్రంశెట్టివారిపాలెం వద్ద ఏర్పాటు చేసిన బాటలు కూడా కొట్టుకుపోయాయి. వైవీ పాలెం వద్ద బాటలు కొట్టుకుపోవడం వల్ల పి.గన్నవరం మండలానికి సరిహద్దులో ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలానికి చెందిన పెదమల్లంక, అనగర్లంక, సిర్రావారిలంక గ్రామాలకు కూడా రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆ గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. తాత్కాలిక రహదారులు కొట్టుకుపోవడంతో వరదల సీజన్ తగ్గే వరకూ సుమారు మూడు, నాలుగు నెలల పాటు ఆయా లంక గ్రామాల ప్రజలు బయటకు రావాలంటే పడవలపైనే ప్రయాణించాలి. గతంలో వరద బాధితులను పరామర్శించేందుకు ఇక్కడకు వచ్చిన నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.49.5 కోట్లతో వశిష్ఠ నదిపై వంతెన నిర్మాణ పనులను ప్రారంభించిన విషయం విదితమే. ఇప్పటికి 60 శాతం పనులు పూర్తయ్యాయి. వంతెన నిర్మాణం పూర్తయితే నాలుగు గ్రామాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.

రాకపోకలకు బ్రేక్

అయినవిల్లి: ముక్తేశ్వరం – కోటిపల్లి రేవులో ఏర్పాటు చేసిన తాత్కాలిక రహదారి వరద ఉధృతికి కొట్టుకుపోయింది. కొట్టుకుపోయిన తాత్కాలిక రహదారిపై ఓ ప్రయాణికుడు బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి పడబోతుండగా తోటి ప్రయాణికుడు కాపాడాడు. దీంతో పెనుముప్పు తప్పింది. ఇక్కడ ప్రమాదం పొంచి ఉండటంతో రేవులో పూర్తిగా రాకపోకలను నిలిపేశారు.



ముక్తేశ్వరం-కోటిపల్లి రేవులో తాత్కాలిక రహదారిపై నీటి ప్రవాహంలో వెళ్తున్న ప్రయాణికులు

ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు డబ్బు డిమాండ్

ఏసీబీకి చిక్కిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్



లంచం తీసుకుంటూ పట్టుబడిన ఆర్ఐ రాంబాబు

రాజోలు: చనిపోయిన ఉద్యోగికి ప్రభుత్వం నుంచి వచ్చే లబ్ధి పొందేందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడానికి లంచం అడిగిన రాజోలు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కె.రాంబాబును గురువారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ కిశోర్‌కుమార్ కథనం ప్రకారం.. రాజోలుకు చెందిన గుబ్బల కృష్ణతులసి భర్త బాలకృష్ణ స్థానిక ఫైర్ స్టేషన్‌లో ఫైర్ ఆఫీసర్‌గా పని చేస్తూ గుండెపోటుతో మృతి చెందారు. బాలకృష్ణ మృతి చెందడంతో ఫైర్ డిపార్ట్‌మెంట్ నుంచి రావాల్సిన లబ్ధిని పొందేందుకు నో ఎర్నింగ్, నో ప్రాపర్టీ తదితర ధ్రువీకరణ పత్రాలకు కృష్ణతులసి దరఖాస్తు చేసుకున్నారు. రెండు నెలలుగా ఆమెకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా ఆర్ఐ రాంబాబు కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆమెకు నో ఎర్నింగ్, నో ప్రాపర్టీ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసేందుకు రూ. 20 వేలు డిమాండ్ చేయడంతో కృష్ణతులసి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. రూ. 20 వేలు ఆర్ఐ రాంబాబు తన కార్యాలయంలో తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ కిశోర్‌కుమార్, సీఐలు భాస్కరరావు, సతీష్, వాసుకృష్ణ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడు రాంబాబును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ వివరించారు. తన భర్త బాలకృష్ణ చనిపోయిన నాటి నుంచి చాలా ఇబ్బందులు పడుతున్నానని, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం ఆర్ఐ రాంబాబు రూ. 15 వేలు డిమాండ్ చేస్తే ఆ డబ్బులు ఇచ్చి సర్టిఫికెట్ తీసుకున్నానని బాధితురాలు కృష్ణతులసి చెప్పారు. మళ్లీ నో ఎర్నింగ్, నో ప్రాపర్టీ సర్టిఫికెట్స్ కోసం రూ. 20 వేలు డిమాండ్ చేస్తే విసిగిపోయి ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశానని చెప్పారు. ఆర్ఐ రాంబాబు నాలుగు నెలల కిందట రామచంద్రపురం నుంచి రాజోలు బదిలీపై వచ్చారు. వచ్చిన నాటి నుంచి ఆయనపై తమకు పలు ఫిర్యాదులు వచ్చాయని ఏసీబీ అధికారులు తెలిపారు.

విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి

సీతానగరం: చినకొండేపూడిలో నివాసం ఉంటున్న పోలవరం ప్రాజెక్టు ఉద్యోగి అంకిత్ కటియార్ (34) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడని ఎస్సై డి.రామ్‌కుమార్ గురువారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పోలవరం ప్రాజెక్టులో ఫీల్డ్ ఇంజినీర్‌గా ఉత్తరప్రదేశ్‌లోని బెహత్ జిల్లా లాల్‌పూర్ జమల్‌పురానికి చెందిన అంకిత్ కటియార్ పని చేస్తున్నారు. గురువారం ఉదయం 8 గంటలకు ఉత్తరప్రదేశ్‌లో ఉంటున్న తన భార్యతో ఫోన్‌లో మాట్లాడాడు. తర్వాత బంధువులు ఎన్నిసార్లు ఫోన్ చేసినా తీయకపోవడంతో సహ ఉద్యోగి వచ్చి చూడగా అంకిత్ మృతి చెంది ఉన్నాడు. చేతిలో చిన్న ఫ్యాన్‌కు విద్యుత్ రావడంతో షాక్‌కు గురై మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సహ ఉద్యోగి గిరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామ్‌కుమార్ తెలిపారు.

అక్కాచెల్లెళ్ల అదృశ్యం

రావులపాలెం: ఇద్దరు బాలికలు అదృశ్యమైన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఎం.శేఖర్‌బాబు గురువారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని గోపాపురానికి చెందిన ఇద్దరు బాలికలు అక్కాచెల్లెళ్లు. గురువారం వారి తల్లిదండ్రులు బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చేసరికి ఆ అక్కాచెల్లెళ్లు కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో తండ్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

కట్టె కాలే వరకూ వైఎస్సార్ సీపీతోనే..

- అనవసర ప్రేలాపనలు కట్టిపెట్టండి
- వైఎస్సార్ సీపీ యువజన విభాగం ప్రాంతీయ సమన్వయకర్త గణేష్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జక్కంపూడి గణేష్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: జక్కంపూడి కుటుంబం కట్టె కాలే వరకూ వైఎస్సార్ సీపీతోనే ఉంటుందని ఆ పార్టీ యువజన విభాగం గోదావరి జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త జక్కంపూడి గణేష్ స్పష్టం చేశారు. తన సోదరుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాతో పాటు తన కుటుంబ సభ్యుల వ్యక్తిత్వహననానికి పాల్పడుతూ కొందరు పనిగట్టుకుని సామాజిక మాధ్యమాల్లో చేస్తోన్న ట్రోలింగ్‌పై గణేష్ తీవ్రంగా స్పందించారు. గురువారం రాత్రి కాకినాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ల్యాండ్ మాఫియా, బెట్టింగ్ క్లబ్‌ల మీద తమపై జనసేన నేతలు చేసిన ఆరోపణలను దమ్ముంటే నిరూపించాలన్నారు. జనసేన నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఇక్కడితో కట్టిపెట్టాలన్నారు. లేదంటే అందుకు తగిన రీతిలో తమ సత్తా ఏంటో చూపిస్తామన్నారు. పవన్ కళ్యాణ్‌పై తన సోదరుడు రాజా అభివృద్ధి విషయంపై చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ నేతలు అవాకులుచవాకులు మాట్లాడుతున్నారన్నారు. ఇదే పవన్‌కళ్యాణ్ ఎన్నికల ప్రచారంలో తమ కుటుంబ వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా మాట్లాడినప్పుడు తామెంత బాధపడ్డామో వారికి తెలియదా అని గణేష్ ప్రశ్నించారు. తన తండ్రి రామ్మోహన్‌రావుపై వ్యక్తిగత విమర్శలకు దిగుతున్న వారు గత చరిత్ర తెలుసుకుని మాట్లాడాలన్నారు. తన సోదరుడు రాజా జనసేనలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ చేస్తున్న ప్రచారాన్ని గణేష్ ఖండించారు. తమ కుటుంబం రాజశేఖర్‌రెడ్డితో కలసి ప్రయాణించిందని, ఆయన బిడ్డ జగన్ వెంటే ఉంటుందన్నారు. తమ కుటుంబానికి రాజకీయాలు కొత్త కాదని, రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమేనన్నారు. తమ పార్టీ ఓడిపోయినా తాము మాత్రం ఎక్కడికీ పారిపోలేదన్నారు. గెలిచినప్పుడు ఎలా పని చేశామో... ఓటమి తరువాత అదే విధంగా నియోజకవర్గంలో పని చేస్తున్నామన్నారు. తన తండ్రికి దక్కిన గౌరవమే తన అన్న రాజాకు దక్కుతుందన్నారు. వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, తన సోదరుడు మరో మూడు సార్లు ఎమ్మెల్యే అయ్యాకనే రాజకీయాల నుంచి నిష్క్రమిస్తామన్నారు.

చరిత్ర తెలుసుకుని మాట్లాడండి

1999 ఎన్నికల్లో రాష్ట్రంలోనే కాకుండా గోదావరి జిల్లాల్లో టీడీపీ విజయం సాధిస్తే ఒకే ఒక స్థానం కడియం నుంచి జక్కంపూడి రామ్మోహనరావు మాత్రమే గెలిచిన చరిత్ర తెలుసుకుని రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సహా ఆ పార్టీ నేతలు మాట్లాడాలని గణేష్ హితవుపలికారు. రాజానగరంలో బత్తుల బలరామకృష్ణ, కాకినాడ రూరల్‌లో పంతం నానాజీ ఇద్దరికీ ఒకటే భయం పట్టుకుందన్నారు. జక్కంపూడి కుటుంబం జనసేనలోకి వచ్చేస్తే వారిని తట్టుకోలేమనే భయం వారిని వెంటాడుతోందన్నారు. జక్కంపూడి కుటుంబం చివరి వరకూ వైఎస్సార్ సీపీతోనే ఉంటుందని గణేష్ పునరుద్ఘాటించారు. తాజాగా రైజ్ అనే సంస్థ రాష్ట్రంలో ఎమ్మెల్యేల పనితీరు, అవినీతి, అక్రమాలపై నిర్వహించిన సర్వేలో మొదటి స్థానంలో పంతం నానాజీ, రెండో స్థానంలో బత్తుల బలరామకృష్ణ ఉన్న విషయం తేటతెల్లమైందన్నారు.